
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.5
కనిష్ఠం 23.4


ANDHRAJYOTHY



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.10 (310.3558)	68,210	43,230
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (3.96)	2,724	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.27 (41.63)	13,643	16,000

చికెన్ ధరలు | లైవ్: రూ.130 | డ్రెస్: రూ.200 | స్కిన్‌లెస్: రూ.230



కొత్త ఏడాదిలో యాదాద్రి వెలుగులు

రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు అందించేందుకు యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ వేగంగా సిద్ధమవుతోంది. ఒక్కో ఘట్టాన్ని విజయవంతంగా పూర్తిచేస్తున్న అధికారులు ప్లాంట్ నుంచి విద్యుదుత్పాదన చేపట్టేందుకు అవసరమైన కార్యాచరణ చేస్తున్నారు. బుధవారం కీలకమైన రెండో యూనిట్ సింక్రనైజేషన్ ప్రక్రియను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. నల్లగొండ జిల్లాలోని దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న ఈ విద్యుత్ కేంద్రం నుంచి తొలిదశలో ఈ ఏడాది డిసెంబరు నాటికి మూడు యూనిట్ల ద్వారా 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి మిగిలిన రెండు యూనిట్లు కలిపి మొత్తం 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు పనులు కొనసాగుతున్నాయి.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

- డిసెంబరు నెలాఖరుకు 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- నిర్వాసితులకు ఉద్యోగాలిస్తామని ఉపముఖ్యమంత్రి హామీ
- పర్యావరణ అనుమతులొచ్చాక వేగవంతమైన పనులు
- ప్లాంట్ పనులతో సమాంతరంగా రైల్వేలైన్ నిర్మాణం
- వచ్చే ఏడాది మార్చి నాటికి ప్లాంట్ మొత్తం సిద్ధం

యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో తొలుత 50శాతం విదేశీ బొగ్గు, మరో 50శాతం స్వదేశీ బొగ్గును వినియోగిస్తామని ప్రభుత్వం ప్రకటించగా, అనంతర కాలంలో మొత్తం స్వదేశీ బొగ్గుతో నిర్వహిస్తామని వెల్లడించింది. దీంతో ఈ ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పర్యావరణవేత్తలు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసువేశారు. ఈ కేసుతో పర్యావరణ అనుమతులను కేంద్ర పర్యావరణ సంస్థ నిలిపివేసి, మళ్లీ ప్రజాభిప్రాయసేకరణ చేపట్టాలని ఆదేశించింది. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 20న ప్రజాభిప్రాయసేకరణ చేపట్టి నివేదించడంతో ఈ కేసును గ్రీన్‌ట్రిబ్యునల్ కొట్టివేసింది. ఫలితంగా కేంద్ర పర్యావరణ సంస్థ ఈ ఏడాది జూలై 5న అనుమతులు మంజూరు చేసింది. అప్పటి నుంచి ప్లాంట్ పనులు ఊపందుకున్నాయి. రాష్ట్ర ఇంధనశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉపముఖ్యమంత్రి ప్రతీ వారం అధికారులు, ఇంజనీర్లతో సమీక్ష నిర్వహిస్తూ పనుల పురోగతికి లక్ష్యం విధించారు. దీంతో పనుల్లో వేగం పెరిగింది. మొత్తం ఐదు యూనిట్లకు మొదటి రెండు యూనిట్లలో ఇప్పటికే లైటప్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. తాజాగా, బుధవారం రెండో యూనిట్‌లో సింక్రనైజేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 30న మొదటి యూనిట్‌లోనూ సింక్రనైజేషన్ ప్రారంభించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. రెండో యూనిట్‌లో కీలకమైన బొగ్గు మండించే ప్రక్రియను చేపట్టడం ద్వారా ఈ యూనిట్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బాయిలర్‌ని సిద్ధం చేసే ప్రక్రియను అక్టోబరు 5న, అక్టోబరు 15న మొత్తం రెండో యూనిట్ ట్రయల్ ఆపరేషన్ చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా మొదటి యూనిట్‌లో ఈనెల 30న సింక్రనైజేషన్ చేసి, అక్టోబరు 25న బొగ్గు మండించే ప్రక్రియ, 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బాయిలర్‌ను సిద్ధం చేసే ప్రక్రియను చేపట్టి, అక్టోబరు 30న మొత్తం మొదటి యూనిట్ ట్రయల్ రన్ నిర్వహించనున్నారు.

● నాలుగో యూనిట్‌లో ఈ నెల 25న బాయిలర్ లైటప్ ప్రక్రియ, నవంబరులో స్టీమ్ బ్లోయింగ్, డిసెంబరు 15న సింక్రనైజేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ ఏడాది డిసెంబరులో బొగ్గును మండించి విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, డిసెంబరు నెలాఖరుకు పూర్తిస్థాయి ట్రయల్‌రన్ నిర్వహించనున్నారు.

● మూడో యూనిట్ బాయిలర్ లైటప్ ప్రక్రియ అక్టోబరు 10న, స్టీమ్ బ్లోయింగ్ ప్రక్రియ డిసెంబరులో, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సింక్రనైజేషన్, బొగ్గు మండించి విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, అదే ఏడాది ఫిబ్రవరి నెలాఖరుకు ట్రయల్ ఆపరేషన్ పూర్తిచేస్తారు.

● ఐదో యూనిట్‌లో ఈ ఏడాది డిసెంబరు 15న బాయిలర్ లైటప్ చేపట్టనున్నారు. వచ్చే ఏడాది జనవరిలో స్టీమ్‌బ్లోయింగ్ ప్రక్రియ, ఫిబ్రవరిలో సింక్రనైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తారు. మార్చిలో బొగ్గు మండించి విద్యుత్ ఉత్పత్తి నిర్వహించడంతో పాటు, అదే నెలలో ట్రయల్‌రన్ చేపట్టి మొత్తం ప్లాంట్‌లో అన్ని యూనిట్లను విద్యుత్ ఉత్పత్తికి సిద్ధం చేయనున్నారు.

నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని డిప్యూటీ సీఎం ఆదేశం

రాష్ట్ర ప్రగతి కోసం తరతరాలుగా తమ కుటుంబాలకు ఆదరువైన భూములు ఇచ్చిన త్యాగధనులను ప్రభుత్వం గుర్తిస్తుందని, వారి కుటుంబాలకు అర్హతల మేరకు ఇదే ప్లాంటులో ఉద్యోగాలిచ్చేందుకు కార్యాచరణ చేపట్టాలని జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్, ఇతర ఉన్నతాధికారులకు ఇక్కడి నుంచే ఆదేశాలిస్తున్నట్లు బుధవారం థర్మల్ ప్లాంట్‌లో సింక్రనైజేషన్ ప్రక్రియను ప్రారంభించిన అనంతరం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. నిర్వాసితులకు ఉద్యోగాలిచ్చే అంశంపై ఆయన ఆదేశాలివ్వడంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేయడంతో పాటు, అధికారులు ఈ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా భూనిర్వాసితులందరికీ ఉద్యోగాలొస్తాయని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. మంత్రుల ఆదేశాలతో నిర్వాసితులకు ఊరట కలిగింది. ప్లాంట్ కోసం 4,676 ఎకరాల భూమిని సేకరించగా, సుమారు 1,560 కుటుంబాలకు చెందిన వారికి ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు. ప్లాంట్ ప్రారంభోత్సవానికి ముందే జాబ్‌కార్డులు ఇచ్చి, ఆయా ఉద్యోగాలకు శిక్షణ కూడా ఇవ్వాలని జెన్‌కో అధికారులను డిప్యూటీ సీఎం, మంత్రులు ఆదేశించారు. పెండింగ్ పరిహారం, ఇళ్లు కోల్పోయిన కపూర్‌తండా, మోదుగులకుంటతండాలకు చెందిన గిరిజన కుటుంబాలకు ఏర్పాటు చేసిన ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో మౌలిక వసతుల కల్పనపై కూడా దృష్టి సారించి పనులు పూర్తి చేయాలని అధికారులను వారు ఆదేశించారు.



యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో సింక్రనైజేషన్‌ను ప్రారంభిస్తున్న భట్టి

వచ్చే నెలాఖరుకు రైల్వేలైన్ పనులు పూర్తి

యాదాద్రి థర్మల్‌పవర్‌ప్లాంట్‌లో కీలకమైన రైల్వే ట్రాక్ నిర్మాణపనులు కూడా ప్లాంట్ నిర్మాణ పనులకు సమాంతరంగా వేగంగా కొనసాగుతున్నాయి. ఈ ప్లాంట్‌కు ఏడాదికి 12.29మిలియన్ యూనిట్ల బొగ్గు అవసరమవుతుందని అంచనా. రైల్వేలైన్ అందుబాటులోకి వస్తే తక్కువ రవాణా వ్యయంతో బొగ్గును అందుబాటులోకి తెచ్చుకునే వెసులుబాటు ఉంటుందనే అంచనాతో ఈ పనుల్లో వేగం పెంచారు. సగటున నెలకు ఒక మిలియన్ యూనిట్ల బొగ్గు ఇక్కడ అవసరం. ఈ బొగ్గును పూర్తిస్థాయిలో సింగరేణి గనుల నుంచే తీసుకోవాలని తాజాగా నిర్ణయించారు. బొగ్గును రవాణా చేసే నిమిత్తం ప్లాంట్ వద్దకు విష్ణుపురం నుంచి ప్రత్యేకంగా రైల్వేలైన్ ఏర్పాటుచేస్తున్నారు. ఈ పనులు ప్రస్తుతం చివరిదశకు చేరాయి. నాలుగు బ్రిడ్జిలున్న చోట్ల మినహా మిగిలిన ట్రాక్ పనులు మొత్తం పూర్తయ్యాయి. ప్లాంట్ వద్ద ఎక్స్‌చేంజ్‌యార్డు పనులు ప్రస్తుతం కొనసాగుతుండగా, బ్రిడ్జిల వద్ద ట్రాక్ పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటితో పాటు జాన్‌పహాడ్ నుంచి విష్ణుపురం వరకు రైల్వేట్రాక్ పనులు పూర్తవగా, జాన్‌పహాడ్ స్టేషన్ పనులు పూర్తయ్యాయి. రైల్వేశాఖ ఈ మార్గంలో నిర్వహించాల్సిన సైట్ యాక్సెప్టెన్సీ టెస్ట్‌కు రంగం సిద్ధం చేశారు. ఈ ప్లాంట్‌కు ప్రత్యేకంగా రెండు లోకోమోటివ్‌లను ఇప్పటికే సైట్ వద్దకు చేర్చారు. ఈ నెలాఖరులోగా రైల్వేశాఖ నుంచి ట్రాక్ సర్టిఫికెట్, క్లియరెన్స్ వస్తుందని అధికారులు భావిస్తున్నారు. అక్టోబరు 1నుంచి సింగరేణి గనుల నుంచి బొగ్గు తరలించేందుకు అవసరమైన అనుమతులు మంజూరయ్యాయి. మొత్తంగా రైల్వేట్రాక్ పనులు పూర్తిచేయడంతో పాటు ఇక్కడికి బొగ్గు తరలించేందుకు ప్లాంట్ వద్ద అవసరమైన పనులన్నీ పూర్తవుతున్నాయి. ఈ ఏడాది డిసెంబరుకు ముందే అంటే నవంబరు మొదటి వారానికే ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామని జెన్‌కో అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జనాభాకనుగుణంగా తాగునీటి కేటాయింపు

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 11: చౌటుప్పల్ మునిసిపాలిటీలో రోజు రోజుకూ పెరుగుతున్న జనాభాకనుగుణంగా మిషన్ భగీరథ తాగునీటిని కేటాయించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నాంపల్లి మండలం లింగోటంలోని మిషన్ భగీరథ శుద్ధి కేంద్రం నుంచి నియోజకవర్గానికి వస్తున్న నీటి సరఫరాపై వివరాలు తెలుసుకున్నారు. చౌటుప్పల్, చండూరు మునిసిపాలిటీలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరాను పెంచాలంటే ముందుగా కృష్ణా జలాలను శుద్ధిచేసే కేంద్రంలోకి లిఫ్టింగ్ చేస్తున్న మోటార్ల కెపాసిటీని పెంచాల్సి ఉంటుందన్న విషయాన్ని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు వెంటనే ఎమ్మెల్యే స్పందించి మోటార్ల కెపాసిటీని పెంచేందుకు తగిన ప్రతిపాదనలను సిద్ధంచేయాలని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాబోయే కాలంలో మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్, చండూరు మునిసిపాలిటీలతోపాటు ఏ ఒక్క గ్రామంలో కూడా నీటి ఎద్దడి రాకుండా అవసరమైన అన్ని రకాల ముందు జాగ్రత్తలను తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్ఈ కృష్ణయ్య, ఈఈ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

ధాన్యం కొనుగోళ్ల పరికరాలను సిద్ధంచేయాలి

● డీఎంవో సబిత

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 11: జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్ల కోసం పీపీసీ (ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్స్)లకు అవసరమైన పరికరాలను సిద్ధంచేయాలని డీఎంవో సబిత సూచించారు. చౌటుప్పల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో బుధవారం జిల్లాలోని చౌటుప్పల్, భువనగిరి, ఆలేరు, మోత్కూరు, వలిగొండ ఏఎంసీ కార్యదర్శులతో డీఎంవో సబిత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ, వచ్చే నెలలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయని, అందుకోసం అవసరమైన ఎలక్ట్రిక్ కాంటాలు, తేమ పరికరాలకు చిన్న చిన్న మరమ్మతులు ఉంటే చేయించాలన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించే నాటికి అన్నిరకాల పరికరాలను సిద్ధంచేయాలన్నారు. జిల్లాలోని ఐదు ఏఎంసీలకు మార్కెట్ ఫీజు రూ.22.49లక్షలను లక్ష్యంగా నిర్దేశించారని చెప్పారు. సమావేశంలో ఏఎంసీల సెక్రటరీలు రవీందర్‌రెడ్డి, సుదర్శన్ రావు, పద్మజా, వెంకటలక్ష్మి, ఎం.రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంవో సబిత

అక్రమార్కులకు సహకరించిన అధికారులపై చర్యలు

● ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



భూమిని పరిశీలిస్తున్న విప్ బీర్ల అయిలయ్య

మోటకొండూరు, సెప్టెంబరు 11: మండలంలోని సికిందర్‌నగర్ సర్వే నెం.533/బీలో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా ఫౌతీ చేసుకున్న వారిపై చర్యలు తీసుకొని, అందుకు సహకరించిన రెవెన్యూ అధికారులను విధుల నుంచి సస్పెండ్ చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని సికిందర్‌నగర్‌లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని అధికారులు, గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన షేక్ ఖాసీంబీ తన పట్టా భూమిని గ్రామస్థులకు ఇళ్లు నిర్మించుకునేందుకు ఇచ్చారని, ప్రస్తుతం ఆమె చనిపోవడంతో షేక్ మల్లైకబీ, పఠాన్ అఫ్జల్‌బీ, పఠాన్ తాజ్‌బీ, షేక్ మస్తాన్‌లు ఖాసీంబీ వారసులమని చెప్పి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించారన్నారు. రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి తలా ఎకరం చొప్పున అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆ భూమిలో కమ్యూనిటీహాల్, పల్లె ప్రకృతివనం, నూతన గ్రామపంచాయతీ భవనం ఏర్పాటుకోసం శంకుస్థాపన చేయడంతో ప్రభుత్వ భూమిగా గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమి అయినప్పటికీ, అవేమీ తమకు పట్టనట్లు వ్యవహరించి, పంచనామా చేసిన ఆర్ఐ, సర్వేయర్‌పై మండిపడ్డారు. వెంటనే వారిని విధుల నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నకిలీ ధ్రువపత్రాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏసీపీ రమేష్ కుమార్‌ను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీవో ఇందిర, సీఐ కొండలరావు, జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మదార్‌గౌడ్, ఎస్ఐ పాండు, సర్వేయర్ శివ, చెన్నయ్య, మల్లయ్య, బాలస్వామి, చిన్నయ్య, నిర్మల ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

మోత్కూరు, సెప్టెంబరు 11: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. బుధవారం మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అంకితభావంతో బోధన చేయాలని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా సహకరించాలన్నారు. పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా వీలు చిక్కినప్పుడల్లా ఎస్ఐ, తహసీల్దార్, ఇతర ఉన్నతాధికారులను పాఠశాలకు పిలిచి చట్టాలు, వివిధ వ్యవస్థల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని హెచ్ఎం గోపాల్‌రెడ్డికి సూచించారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులను కూడా ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. ప్రతిజ్ఞ్యరూ 'ప్రభుత్వ పాఠశాలను ప్రేమిద్దాం... ప్రభుత్వ పాఠశాలకు పంపిద్దాం' అన్న నినాదంతో పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. 'మన బస్తీ-మన బడి' పథకంలో మంజూరైన నిధులు విడుదల చేయించాలని, తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం, మోత్కూరు పాఠశాలకు ప్రహరీ, విద్యార్థులకు మూత్రశాలల ఏర్పాటు, గ్రామాల నుంచి విద్యార్థులు పాఠశాలకు వస్తున్నందున గ్రామాల స్టేజీల వద్ద ఆర్టీసీ బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ హెచ్ఎం టి.గోపాల్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. అనంతరం క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, ఎస్ఐ నాగరాజు, గడ్డం నర్సింహ, అవిశెట్టి అవిలిమల్లు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వినోబాభావే ఆశయాలు సాధించాలి

● గాంధీగ్లోబెల్ ఫ్యామిలీ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి



వినోబా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న రాజేందర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 11: ఆచార్య వినోబా భావే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గాంధీ గ్లోబెల్ ఫ్యామిలీ రాష్ట్ర అధ్యక్షుడు గున్నా రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. వినోబాభావే జయంతిని పట్టణంలోని వినోబామందిరంలోని భూదాన్‌గంగోత్రి ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలైన శాంతి, అహింసా సిద్ధాంతాలను బహుళ ప్రచారం చేసిన ఆయన ఆధ్యాత్మిక వారసుడు ఆచార్య వినోబాభావే చేపట్టిన భూదానోద్యమం ద్వారా భూదాన్‌పోచంపల్లికి ఖండాంతర ఖ్యాతి లభించిందన్నారు. వినోబాభావే ఆశయాలు నేటికీ ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో వినోబాసేవాసంఘం నాయకులు ఏలె భిక్షపతి, కొయ్యడ నర్సింహగౌడ్, వేశాల మురళి, కర్నాటి అంజమ్మ, పద్మశాలీ మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములుశ్రేష్ఠి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వకు నిధులు మంజూరు చేయాలి

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

భువనగిరి అర్బన్, భువనగిరి రూరల్, వలిగొండ, సెప్టెంబరు 11: బునాదిగాని కాల్వ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో వలిగొండ, బీబీనగర్, భువనగిరి మండలాల్లో సైకిల్, బైక్ యాత్రలు నిర్వహించి, చివరగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీతారాములు మాట్లాడుతూ బునాదిగాని కాల్వ నిర్మాణంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. 2006లో ప్రారంభమైన కాల్వ ఇప్పటివరకు పూర్తికాకపోవడం విచారకరమన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కొండమడుగు నర్సింహ, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, సిర్పంగి స్వామి, దయ్యాల నర్సింహ, యాదగిరి, కృష్ణ, వెంకటేశ్, రాములమ్మ, చంద్రారెడ్డి, యాదిరెడ్డి, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మల్లేశం, స్వామి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



తండ్రి చేతిలో కుమారుడి హతం

సూర్యాపేట, సెప్టెంబరు 11 : మద్యానికి బానిసై తరుచూ వేధిస్తున్న కుమారుడిని తండ్రి హతమార్చాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం కొత్తతండా పరిధిలోని బాపూజీతండాలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. మద్యానికి బానిసై డబ్బుల కోసం వేధిస్తున్న కుమారుడు బానోత్ కిరణ్(37)ని అతడి తండ్రి పంతులు గొడ్డలితో దాడి చేసి హతమార్చినట్లు స్థానికులు తెలిపారు. కిరణ్ తన తండ్రిని తరుచూ డబ్బులు ఇవ్వాలంటూ వేధిస్తూ ఉండేవాడని, బుధవారం సాయంత్రం భార్య బంధువుల ఇంటికి వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో తండ్రి పంతులుతో కిరణ్ మద్యంమత్తులో గొడవపడినట్లు స్థానికులు తెలిపారు. విసిగివేసారిన తండ్రి పంతులు పక్కన ఉన్న గొడ్డలితో కిరణ్‌పై దాడి చేయడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ సైదులు, సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి క్లూస్‌టీంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పంతులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కిరణ్‌కు భార్య సౌజన్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా పంతులు వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తుండగా, కిరణ్ మద్యానికి బానిసై ఏపనీ చేయడం లేదు. ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

ఐదుగురు బాలురకు గాయాలు

చివ్వెంల, సెప్టెంబరు 11: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో పిచ్చికుక్కదాడిలో ఐదుగురు బాలురు గాయపడ్డారు. చందుపట్ల(బీ) గ్రామంలో ఇద్దరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆరుబయట ఆడుకుంటున్న శిగ జశ్విత్, కాసాని సోన్విత్, సిద్దోజు వివేక్‌లు సాయంత్రం సమయంలో ఆడుకుంటున్నారు. అదే సమయంలో గ్రామంలో కొద్దిరోజులుగా తిరుగుతున్న పిచ్చికుక్క బాలురపై దాడి చేసింది. అనంతరం ఎస్సీ బాలుర హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు బయట నిల్చోగా వారిపై దాడిచేసింది. పిచ్చికుక్క దాడిలో మొత్తం ఐదుగురు బాలురకు స్వల్పంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు.


అదుపు తప్పిన ప్రైవేట్ పాఠశాల బస్సు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 11: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలో డ్రైవర్ అప్రమత్తతతో ప్రైవేట్ పాఠశాల బస్సుకు ప్రమాదం తప్పింది. ఆ సమయంలో బస్సులో 30మంది విద్యార్థులున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చింతలపాలెం మండలంలోని పలు గ్రామాల నుంచి విద్యార్థులను మండల కేంద్రానికి తీసుకువస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు బుధవారం మండల కేంద్రానికి సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి పక్కన ఉన్న డైవర్షన్ రోడ్డులో అదుపుతప్పింది. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రధాన రహదారిని నిలిపివేసిన అధికారులు రైల్వేట్రాక్ పక్కన డైవర్షన్ రోడ్డును తాత్కాలికంగా ఏర్పాటుచేశారు. ఇటీవలి భారీవర్షాలకు రోడ్డు పూర్తి స్థాయిలో ధ్వంసమైంది. డైవర్షన్ రోడ్డులో భారీ గుంతలు ఏర్పడ్డాయి. భారీ గుంతల నుంచి తప్పించబోయిన డ్రైవర్ రోడ్డు పక్కగా బస్సు నడిపాడు. పూర్తిగా బురదమయమైన రోడ్డు నుంచి బస్సు టైర్లు ఒక్కసారిగా జారి పక్కన ఉన్న పొలాల సరిహద్దులోకి వెళ్లింది. టైర్లు బురదలో కూరుకుపోయి బస్సు నిలిచిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది విద్యార్థులు ఉన్నారు. బస్సు నిదానంగా వెళ్తుండటం, డ్రైవర్ అప్రమత్తతతో బస్సును వెంటనే నిలిపివేసి విద్యార్థులను కిందకు దింపాడు. అటుగా వెళ్తున్న స్థానిక రైతులు ట్రాక్టర్ల సహాయంతో బస్సును బయటకులాగారు. అనంతరం స్కూల్ ఆటోల్లో విద్యార్థులను తరలించారు.



బురదలో చిక్కుకున్న బస్సును లాగేందుకు ఏర్పాట్లు చేస్తున్న స్థానికులు
















మహిళా స్వావలంబనలో 'స్వరభారతీ'

గ్రామీణ మహిళలకు ఆర్థికభరోసాతో పాటు వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు పిలుపు స్వచ్ఛంద సంస్థ చేపట్టిన కార్యాచరణ ఎంతో మంది జీవితాలను మలుపుతిప్పింది. మూడు దశాబ్దాల కిందట గ్రామీణ మహిళలు ప్రతీ అవసరానికి ఇంటి యజమానులపై ఆధారపడే పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లో వారికి ఎదురయ్యే సమస్యలను చర్చించుకోవడంతో పాటు ఆర్థికస్వేచ్ఛ కోసం నెలకొన్నదే సంస్థ పిలుపు. ఆ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన స్వరభారతీ మ్యాక్స్ సొసైటీ ఎంతోమంది జీవితాల్లో మార్పు తీసుకువచ్చింది. పిలుపు సంస్థ వ్యవస్థాపకులు ఎం.జనార్ధన్ ఆలోచనలోంచి 1993లో పుట్టిన ఈ సంస్థ ఎంతోమందిని మహిళల జీవితాల్లో వెలుగులు నింపింది. నింపుతోంది.

-తుర్కపల్లి

● తుర్కపల్లి, భువనగిరి మండలాల్లో నిర్వహణ ● నేడు సొసైటీ రజతోత్సవాలు



గ్రామగ్రామాన తిరిగి పేద మహిళలను సమావేశపర్చి వారి పరిస్థితులను విశదీకరించి, పొదుపు పరపతి అవశ్యకతను తెలిపి, వారి అభీష్టంతో రూ.10తో పొదుపు పరపతి మొదలుపెట్టారు. ఏడాదిలో 250 మంది సభ్యులుగా చేరారు. ఎన్నో ఆటుపోట్లను నిష్టూరాలను ఎదుర్కొన్నారు. పిలుపు సంస్థ ఆధ్వర్యంలో 1997 ఆగస్టు నాటికి 9 గ్రామాల్లో 1,026 మంది సభ్యులతో కలిపి స్వరభారతీ పేరున అన్‌రిజిస్టర్డ్ సొసైటీగా రూపొందింది. ఇందులో ఓ సంస్థకు ఉన్నట్లుగానే జనరల్ బాడీని ఏర్పాటుచేశారు. ఆ తర్వాత రెండేళ్లకు 1999 మార్చిలో తొమ్మిది గ్రామాలు 1,026 మంది సభ్యులతో కూడిన మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు పరపతి సంఘం లిమిటెడ్ పేరున 1995 మ్యాక్స్ చట్టం కింద స్వరభారతీ మ్యాక్స్ పేరుతో రిజిస్టర్ చేశారు.

వడ్డీ తగ్గిస్తూ.. పొదుపుపై వడ్డీ చెల్లిస్తూ

పిలుపు సంస్థకు 1999-2003 దశలో గ్రామపంచాయతీ 100 గజాల భూమిని విరాళంగా ఇవ్వగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ)ఆర్థిక సహకారంతో సొంత భవనాన్ని నిర్మించుకున్నారు. మరోవక్క ఒక్కో గ్రామానికి విస్తరిస్తూ 2023 నాటికి 17 గ్రామాలు 1,238 మంది సభ్యులకు సంస్థ చేరుకుంది. చేసుకున్న పొదుపు ద్వారా సభ్యుల అవసరాల మేరకు రుణసహాయం పొంది బతుకుదెరువులను మెరుగుపర్చుకోవడం మొదలుపెట్టారు. సభ్యులకు అందించే రుణాలపై 24శాతం వడ్డీ వసూలు చేస్తూ 12 శాతం వారి పొదుపులో జమచేస్తున్నారు. గ్రామాలన్నింటినీ మూడు క్లస్టర్లుగా ఏర్పాటుచేసి ముగ్గురు ఉద్యోగులను నియమించి సంఘాల నిర్వహణ బాధ్యలను అప్పగించారు. వారికి నిర్వహణపై శిక్షణ అందించారు. 2008లో జరిగిన మ్యాక్స్ వార్షిక సమావేశంలో అప్పులపై వడ్డీని 18శాతానికి తగ్గించి ఇందులో 90శాతం సభ్యుల పొదుపులపై చెల్లించడం ప్రారంభించారు.

ఆదాయంతో పాటు ఆహారం



రామోజీనాయక్‌తండాలో స్వరభారతీ ఏర్పాటుచేసిన ఇందిరా బృందంలో 1999లో సభ్యురాలిగా చేరా. మా తండాలో ఇంతకు ముందు జొన్నలు, సజ్జలు బాగా పండించేవారు. కానీ ఐదేళ్ల నుంచి జొన్న సాగు మానేశారు. ఈ సంగతి మా బృందంలో చర్చించుకొని తిరిగి జొన్న పంటను పునరుద్ధరించాలని తీసుకున్న నిర్ణయం మేరకు జొన్న సాగు చేస్తున్నా. అందుకు అనుబంధంగా వ్యాపార పంటైన బంతిని కూడా వేశా. దీంతో మా కుటుంబసభ్యులకు పౌష్టికాహారం లభిస్తుంది, జొన్న సాగు చేసే వారికి పెట్టుబడి సాయం కూడా ఇస్తున్నారు. ఈ పంటల సాగుతో కొంత ఆదాయం పౌష్టికాహారం లభిస్తోంది.

-గుగులోతు అంబి, రామోజీనాయక్‌తండా

ఖర్చులు పోనూ రూ.10 వేల ఆదాయం

ఇంతకు ముందు పౌల్ట్రీఫాం ఉండేది. దాంతో వచ్చే ఆదాయం అవసరాలకు సరిపోయేదికాదు. భావన పొదుపు బృందం నుంచి చిన్నమొత్తాల్లో చాలాసార్లు అప్పు తీసుకొని కుటుంబ అవసరాలు తీర్చుకున్నా.ఇప్పుడు రూ.70వేల అప్పు తీసుకుని జిరాక్స్ మిషన్ పెట్టుకున్నా. ఖర్చులన్నీ పోను నెలకు రూ.10వేల వరకు ఆదాయం వస్తుంది. స్వరభారతికి ధన్యవాదాలు.



వలందాసు లావణ్య, రుస్తాపూర్

2024 మార్చి నాటికి

గ్రామాలు :	14
సభ్యులు :	2,089
బృందాలు :	166
పొదుపులు :	రూ.4.73కోట్లు
మిగులు :	రూ.1.24కోట్లు

బ్యాంకుల రుణసాయం

2009-2013 మధ్యలో 20గ్రామాల్లోని 2,843 మంది సభ్యులను 206 బృందాలుగా స్టేట్ బ్యాంక్ వారి సహకారంతో ఏర్పాటు చేసి, బృందాల పేరున బ్యాంక్ ఖాతాలను తెరిచి అప్పటివరకు సమకూరిన పొదుపులు, పొదుపులపై చెల్లించిన వడ్డీని ఖాతాల్లో జమచేశారు. అప్పటి నుంచి బృందాలస్థాయిలో సభ్యుల సమష్టి నిర్ణయం మేరకు ఆర్థిక లావాదేవీలు ప్రారంభమయ్యాయి. ఈ బృందాలకు మ్యాక్స్ వారి పూచీకత్తుపై హెచ్‌డీఎఫ్‌సీ నుంచి రూ.1.30కోట్లు, ఎస్‌బీఐ తుర్కపల్లి నుంచి రూ.2కోట్ల రుణసాయం అందాయి. వలస పోయిన వృద్ధులు సభ్యత్వాలను విరమించుకున్నారు. ఎప్పటికప్పుడు ఈ బృందాలను పర్యవేక్షిస్తూ అవసరమైన పద్ధతులను రూపొందించుకొని నిరంతరం సంఘ సమావేశాల్లో పాల్గొని సభ్యులను జాగృతం చేసి ముందుకు సాగారు. లెక్కల్లో తప్పొప్పులను సరిచేసుకుంటూ బుక్‌కీపర్లకు తగిన శిక్షణ ఇచ్చారు. కేవలం ఆర్థిక లావాదేవీలే కాకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, మహిళా, పేదల సమస్యలపై పనిచేయడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా 2018 నుంచి బుక్‌కీపర్లకు బృందాల ఆర్థిక పరిపుష్టిని బట్టి రూ.500 నుంచి రూ.300 వరకు రుసుం చెల్లిస్తున్నారు. మిగులు లేని బృందాలకు ఉచితసేవ అందిస్తున్నారు. భవిష్యత్‌లో పిలుపు సంస్థ లేకపోయినా స్వరభారతీ మ్యాక్ ఈ ప్రాంతాల్లోని మహిళలకు అండగా ఉంటుందని భరోసా ఇక్కడి మహిళల్లో కనిపిస్తోంది.

ఈ నెల 12న స్వరభారతీ రజితోత్సవాలు

పిలుపు స్వచ్ఛంద సంస్థ సహకారంతో 1995లో స్వరభారతీ మ్యాక్స్ సొసైటీ రిజిస్ట్రేషన్ అయ్యింది. సొసైటీ ఏర్పాటై 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 12న రజతోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాటుచేశారు. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరవుతున్నట్లు మ్యాక్స్ మేనేజర్, బోర్డు అధ్యక్షురాలు సుమలత తెలిపారు.

● భవిష్యత్‌లో మరింత ముందుకు



30ఏళ్లుగా నడుస్తున్న స్వరభారతీ మ్యాక్స్ తమ అనుభవాలను తీసుకుని భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో సమాజంలో పేదలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. ఆ దిశగా పనిచేయాలని ఆకాంక్షిస్తున్నా.

ఎం.జనార్ధన్, పిలుపు సంస్థ ఎగ్జిక్యూటీవ్, డైరక్టర్

● సిల్వర్ జూబ్లీ జరుపుకోవడం సంతోషం



గత 25 ఏళ్లుగా స్వరభారతీ మాక్స్ ద్వారా ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తూ నేడు సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకోవడం తనతో పాటు గ్రూప్ సభ్యులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- కొడారి సుమలత, స్వరభారతీ మ్యాక్స్ అధ్యక్షురాలు

ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తూ



స్వరభారతీ మ్యాక్స్ ప్రారంభం నుంచి మేనేజర్‌గా పనిచేస్తున్నా. ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తూ బోర్డు, బుక్‌కిపర్ల సమావేశాలు నిర్వహిస్తా. అంతే కాకుండా గ్రామస్థాయిలోని బృందాల ఆర్థిక లావాదేవీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తుంటా. రాబోయే తరం యువతులు స్వరభారతీలో కీలకపాత్ర తీసుకుని ముందుకు నడిపించాలని ఆకాంక్షిస్తున్నాం.

- జీ లక్ష్మి, స్వరభారతీ మ్యాక్స్ మేనేజరు

బీసీ రిజర్వేషన్లు పెంచకపోతే ఉద్యమం ఉధృతం

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 10 : పంచాయతీ రాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచాలని, లేకుంటే ఉద్యమ ఉధృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. బీపీ మండల్ 106 జయంతిని పురస్కరించుకొని బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదురుగా బీపీ మండల్ విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. ఆ మేరకు హామీని నిలబెట్టుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు అక్టోబరు నెలాఖరు వరకు జరుపుతామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు కులగణన చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వం ముందుగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో కులగణన చేసి, రిజర్వేషన్లు పెంచాలన్నారు. అందుకోసం మూడు నెలలుగా ఉద్యమాలు చేస్తున్నాం, అయినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇక రాహుల్‌గాంధీ అయినా స్పందించాలని కోరారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలుపుతారా లేదా ప్రకటన చేయాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు అందుకు విరుద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో బీసీ నేతలు జెండాలు మోసుకుంటు, జిందాబాద్‌లు, బానిసలుగా మారారని, ఇకనైనా ఆ బతుకులకు స్వస్తి చెప్పి ప్రభుత్వంపై ఒత్తిడి కోసం చేసే పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ సవరణ చేయాలి సుప్రీంకోర్టు ప్రకారం తీర్పు ప్రకారం 50శాతం సీలింగ్ అని చెప్పి పెంచకుండా తప్పించుకోవడానికి వీలులేదన్నారు. ఇప్పటికే అగ్రకులాలకు 10శాతం రిజర్వేషన్లు పెట్టి 50శాతం సీలింగ్‌పై పార్లమెంట్ రాజ్యాంగ సవరణ చేసిందన్నారు. ఆ అగ్రకులాలకు రిజర్వేషన్లను పెంచడానికి మూడు రోజుల్లో లోక్‌సభ, రాజ్యసభలో రాజ్యాంగ సవరణ చేసి రాష్ట్రపతి సంతకం చేశారు కానీ 50 శాతం జనాభా గల బీద కులాలకు రాజ్యాంగ సవరణ చేయరా ఇదేం న్యాయమని ప్రశ్నించారు. రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ పార్టీ తన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజారాంయాదవ్, సంఘం జిల్లా అధ్యక్షుడు దూకుడుకు లక్ష్మీ నారాయణ, నీల వెంకటేశం, పిల్లి రామరాజు, వంగూరి నారాయణయాదవ్, ప్రసన్న, శిరందాసు రామదాసు, సత్తయ్య, సర్వాల వెంకన్న, అల్లి వేణు, మామిడి పద్మ, సింగం లక్ష్మీ, కొండూరు సత్యనారాయణ, గోవర్ధన్, గద్దె నాగరాజు, సతీష్ యాదవ్, వల్లేకీర్తి శ్రీనివాస్, మచ్చ గిరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం ఎదగాలంటే బీజేపీ రావాలి

● మల్కాజ్‌గిరి ఎంపీ రాజేందర్



గిరిజన మహిళకు సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ ఈటల

రామగిరి, సెప్టెంబరు 11: తెలంగాణ రాష్ట్రం గొప్పగా ఎదగాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిందేనని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. అవినీతి, కుటుంబపాలన లేని పార్టీ ఏదైనా ఉందంటే అది బీజేపీ పాలన మాత్రమేనని అన్నారు. దేశం అభివృద్ధి కోరుకునే ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వాన్ని తీసుకొని దేశ భవిష్యత్‌కు నాంది పలకాలన్నారు. దేశం కోసం, ధర్మం కోసం పని చేసే పార్టీ కూడా బీజేపీనే అని అన్నారు. ప్రతీ బూత్‌లో సభ్యత్వ నమోదును విరివిగా చేసి రాష్ట్రంలోనే జిల్లాను ముందుంచాలని కార్యకర్తలు పిలుపునిచ్చారు. ప్రజలకు బీజేపీ మీద విశ్వాసం ఉంది కాబట్టే నరేంద్రమోదీని మూడోసారి కూడా గెలిపించుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వీరెళ్లి చంద్రశేఖర్, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, బండారు ప్రసాద్, పిల్లి రామరాజుయాదవ్, గోలి మధుసూదన్‌రెడ్డి, పోతేపాక సాంబయ్య తదితరులు ఉన్నారు. నల్లగొండలోని పాతబస్తీలో ఏర్పాటుచేసిన ఒకటో నెంబర్, 19వవార్డులో ఏర్పాటు చేసిన వినాయకులను ఈటల దర్శించుకున్నారు.

● ఆర్టీసీ పెన్షనర్లకు ఈపీఎఫ్ డిమాండ్ లేఖలు ఇప్పించాలని ఆర్టీసీ పింఛన్‌దారులు దాసోజు శేఖరాచారి, పీఎస్‌పి రావు, పీవై రెడ్డి, దశరథ కోరారు.



ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న పెన్షన్‌దారులు

పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి ఎలా ఉంది?



చిట్యాల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డబ్ల్యూహెచ్‌వో డాక్టర్లు

చిట్యాల, సెప్టెంబరు 11: పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి ఎలా ఉంది? ఇమ్యూనైజేషన్ ప్రక్రియ ఎలా ఉంది, ఫలితాలు ఎలా ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థకు (డబ్ల్యూహెచ్‌వో) చెందిన వైద్యులు ఎస్.అనూష, డేవిడ్ ఆరా తీశారు. బుధవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డబ్ల్యూహెచ్‌వో వైద్యుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు ఆస్పత్రిలో అందుతున్న సేవలు, ఇమ్యూనైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఎంత మందికి టీకాలు(ఇమ్యూనైజేషన్) వేశారు? వాటి ఫలితాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.పద్మ మాట్లాడుతూ టీకాలు వేయించుకుంటే 14రకాల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుని దోమలను నివారించాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎస్‌పీవో కృష్ణ, ఆసుపత్రి సిబ్బంది నర్సింగరావు, ఉదయ్‌రాజు తదితరుల పాల్గొన్నారు.

గొంతుకోసి యువకుడి హత్య



కిరణ్(ఫైల్‌ఫొటో)

నాగారం, సెప్టెంబరు 11: పాతకక్షల నేపథ్యంలో ఓ యువకుడి గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలంలో బుధవారం ఉదయం వెలుగుచూసింది. యువకుడి మృతదేహాన్ని ఎస్సారెస్పీ కాల్వలో పడేయడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ ఐలయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి మునిసిపాలిటీకి చెందిన వనగండ్ల కిరణ్‌కుమార్(27) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో తిరుమలగిరి పరిధిలోని హిల్స్‌కాలనీ నుంచి బైక్‌పై వెళ్తున్నాడు. కిరణ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించి అతడిపై కత్తులతో దాడి చేశారు. స్పృహకోల్పోయిన కిరణ్‌ను కారులో నాగారం మండలం డీ.కొత్తపల్లి గ్రామశివారులోని ఎస్సారెస్పీ కాల్వ వద్దకు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లాక కిరణ్‌ను గొంతుకోసి చంపారు. మృతదేహాన్ని కాల్వలో పడవేసి దుండగులు అక్కడి నుంచి వెళ్లిపోయారని సీఐ తెలిపారు. బుధవారం ఉదయం కాల్వ వెంట పొలాలకు వెళ్తున్న స్థానికులకు కాల్వలో యువకుడి మృతదేహం కనిపించిందన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి పంచనామా నిర్వహించినట్లు సీఐ తెలిపారు. కిరణ్‌కుమార్ అవివాహితుడు కాగా అతడి సోదరుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. త్వరలో దుండగులను పట్టుకుని హత్యకు దారితీసిన కారణాలను ప్రకటిస్తామన్నారు. సంఘటనా స్థలాన్ని సూర్యాపేట డీఎస్పీ జీ రవి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం, ఫోరెన్సిక్ బృందాలు ఆధారాలు సేకరించాయి.

హత్యకు వివాహేతర సంబంధమేనా కారణమా?

దుండగుల దాడిలో చేతిలో హత్యకు గురైన కిరణ్‌కుమార్‌కు తిరుమలగిరికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఉందని అనుమానిస్తున్నారు. ఈ విషయంలో కిరణ్‌తో గతంలో ఓ వ్యక్తి గొడవ పడినట్లు సమాచారం. మృతుడి సోదరుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఫత్తేపురం విజయ్‌తో గతంలో గొడవపడ్డాడని,అతడే తన తమ్ముడిని హత్య చేశాడని అనుమానం వ్యక్తం చేశాడు. ఆ దిశగా విచారణ చేసి, నేరస్తులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

దుండగులను అరెస్ట్ చేయాలని రాస్తారోకో



తిరుమలగిరిలో రాస్తారోకో చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

తిరుమలగిరి : తిరుమలగిరికి కేంద్రానికి చెందిన కిరణ్‌ను కిరాతంగా హత్యచేసిన దుండగలను వెంటనే అరెస్ట్ చేయాలని కుటుంబసభ్యులు తిరుమలగిరి పట్టణంలో ఆందోళన చేశారు. జనగామ- సూర్యాపేట రహదారిపై అంబేడ్కర్‌నగర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్‌లు ఆందోళనకారులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపచేశారు. అంబేడ్కర్‌నగర్‌లో పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాటుచేశారు.

లారీ క్యాబిన్ నుంచి పడి క్లీనర్ మృతి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 11 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో లారీ క్యాబిన్ నుంచి పడి క్లీనర్ మృతి చెందాడు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట మండలం దుబ్బతండాకు చెందిన జాటోత్ నెహ్రూ(30) లారీక్లీనర్‌గా పనిచేస్తున్నాడు. తమ్ముడు శరత్ లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా మేళ్లచెర్వు మండలంలో సిమెంట్ లోడ్ కోసం మంగళవారం రాత్రి హుజూర్‌నగర్ బైపాస్ రోడ్డులో లారీలో వెళ్తున్నారు. ఆ సమయంలో నెహ్రూ క్లీనర్ ప్లేస్‌లో కూర్చొని లారీ డోర్ వేసేందుకు ప్రయత్నించి కిందపడగా లారీ టైర్లు అతడి మీది నుంచివెళ్లాయి. దీంతో నెహ్రూ అక్కడికక్కడే మృతి చెందాడు. నెహ్రూ తండ్రి హనుమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 11 : నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పేరేపల్లిలో విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందారు. గ్రామానికి చెందిన పోలోజు వెంకటాచారి(50) తన నివాస సమీపంలోనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి బుధవారం రాత్రి కిందపడిపోయాడు. కొద్దిసేపటికి అతడిని వినాయక మంట నిర్వాహకులు గమనించే సరికి మృతి చెందాడు. విషయాన్ని స్థానికులకు, కుమారుడు శంకరాచారికి తెలిపారు. వెంకటాచారి భార్య ఐదేళ్ల కిందట మృతి చెందగా వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



వైటీపీఎస్ విద్యుదుత్పత్తి యూనిట్

యదాద్రి థర్మల్ పవర్ స్టేషన్

పనులు చకచకా

దామరచర్ల, సెప్టెంబరు 11 : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం చేపట్టిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్(వైటీపీఎస్) పనులు చకచకా సాగుతున్నాయి. బుధవారం రెండో యూనిట్‌లో సింక్రనైజేషన్ ప్రక్రియను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఆయన వెంట జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఉన్నారు. ఇప్పటికే మొదటి యూనిట్‌లో సింక్రనైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. మొదటి, రెండో యూనిట్‌కు సంబంధించిన పనులను అధికారులు వేగంగా పూర్తి చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది డిసెంబరు నాటికి విద్యుదుత్పత్తిని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.



విద్యుదుత్పత్తి యూనిట్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి





విద్యుదుత్పత్తి యూనిట్‌లోని విద్యుత్ మోటార్లు, ఇతర యంత్రాలు



యూనిట్ 2 ప్రవేశమార్గం



విద్యుదుత్పత్తిని మానిటరింగ్ చేసే కాన్ఫరెన్స్‌హాల్

సీసీరోడ్డు బురదమయం

● అస్తవ్యస్తంగా రోడ్డు నిర్మాణం
● ఇబ్బందిపడుతున్న ప్రజలు



దత్తాయపల్లి ప్రధాన కూడలిలో వేసిన సీసీ రోడ్డుపై నిలిచిన నీరు, బురదగా మారిన రోడ్డు

తుర్కపల్లి, సెప్టెంబరు 11: సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపించడంతో ప్రజలకు పరేషాన్ మిగిలింది. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా సీసీ రోడ్లు వేయడం వల్లే తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో పారిశుధ్య సమస్య అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామంలో మురికి కాలువల నిర్మాణం లేకపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురికి నీరు రోడ్లపైనే ప్రవహిస్తుండడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఎదుట ఉన్న రోడ్డుపైనే మురికి నీరు పారుతుండడంతో కాలనీ వాసులు కాలి నడకన వెళ్లలేక పోతున్నారు. గ్రామంలోని పాత పంచాయతీ (గ్రామ ప్రధాన చౌరస్తా) ముందు వేసిన సీసీ రోడ్డు, యాదవ కమ్యూనిటీ హాల్ వెళ్లే రోడ్డు సీసీ వేయక ముందు రాక పోకలు సాగించడానికి బాగుండేవని, ఇక్కడ సీసీ రోడ్లు వేసిన తర్వాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రోడ్లు వేయడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురికి నీటితో పాటు ఇటీవల కురిసిన వర్షం నీరంతా ఒక దగ్గర నిలిచి పోవడంతో రాకపోకలు సాగించడానికి గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు వేసేటప్పుడు సమతలంగా(సమాతరంగా) రోడ్డుకు రెండు వైపుల ఎత్తుగా వేసి మధ్యలో రోడ్డు వంపుగా ఉండడంతో నీరంతా మధ్యలో నిలిపోతోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. రోడ్డు పక్క నుంచి మురికి కాల్వల నిర్మాణం లేక పోవడంతో పారిశుధ్య సమస్య ఏర్పడింది. మురికి గుంతల్లో నీటి నిలువ కారణంగా ఈగలు, దోమలు విజృంభించి, విష జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న మురికి గుంతల్లో మట్టి పోసి పారిశుధ్య నివారణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు గ్రామస్థులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

మట్టి రోడ్డే బాగుండేది



సీసీ రోడ్డు వేయక ముందు ఉన్న మట్టి రోడ్డే బాగుండేది. సీసీ రోడ్డుపై నిలిచిన మురికి నీరు కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అంతే కాకుండా ఈ రోడ్డు బురదగా ఉండడంతో కాలి నడకన వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ సీసీ రోడ్డుపైన మట్టి పోసి ఇబ్బందులు తొలగించాలి.

-గాదె మల్లేశ్, గ్రామస్థుడు, దత్తాయపల్లి

కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



గ్రామంలో అంతర్గత మురికి కాల్వల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. గ్రామంలో గతంలో వేసిన మురికి కాలువలు పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో గ్రామంలో పారిశుధ్య సమస్య నెలకొంది. సీసీ రోడ్లు, అంతర్గత మురికి కాల్వల నిర్మాణం చేపట్టి, గ్రామంలో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలి.

-గిద్దె కరుణాకర్, మాజీ ఎంపీటీసీ, దత్తాయపల్లి

పొంచిఉన్న ప్రమాదం

● శిథిలావస్థలో ఇనుప స్తంభం



ఇనుప స్తంభం.. పక్కనే నిరుపయోగంగా ఉన్న నూతన స్తంభం

మోటకొండూరు, సెప్టెంబరు 11: మండల కేంద్రంలోని సెయింట్ పీటర్ పాఠశాలకు వెళ్లే మార్గంలో ఇనుపస్తంభం శిథిలావస్థలో ఉంది. గ్రోమోర్ సెంటర్ వద్ద ఉన్న స్తంభం నుంచి సెయింట్ పీటర్ పాఠశాలకు వెళ్లే మార్గంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ ఇనుప స్తంభానికి బాంచిల్ కేబుల్ వేసి వీధి లైటు అమర్చి వదిలేశారు. నిత్యం స్కూల్ విద్యార్థులు అదే దారిన వస్తూ, పోతుంటారు. వర్షాకాలం కావడంతో ఈదురుగాలులు, వర్షాలకు వైర్లు తేలి ఇనుప స్తంభానికి తగిలితే విద్యుదాఘా తంతో ఊహించని నష్టం జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్తంభం పక్కనే విద్యుత్ అధికారులు నూతన స్తంభాన్ని ఏర్పాటు చేసి వదిలేయడంతో అది నిరుపయోగంగా ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి ఇనుప స్తంభం నుంచి విద్యుత్ కనెక్షన్ తొలగించి, నూతనంగా ఏర్పాటు చేసిన స్తంభానికి కనెక్షన్ ఇవ్వాలని కాలనీ వాసులు కోరుతున్నారు. కాగా విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా మండల కేంద్రంలో రోజుల తరబడి పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. కొన్ని కాలనీల్లో రాత్రి సమయాల్లో వెలగాల్సిన వీధి దీపాలు వెలుగకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బీసీ కులగణనను ప్రతిష్టాత్మకంగా పూర్తి చేస్తాం



భువనగిరిలో బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాష్‌ను సన్మానిస్తున్న నాయకులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 11: సుప్రీం, హైకోర్టుల సూచనలను పాటిస్తూ రాష్ట్రంలో బీసీ కులగణనను ప్రతిష్టాత్మకంగా పూర్తి చేస్తామని బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాష్ అన్నారు. బీసీ కమిషన్ సభ్యుడిగా నియమితుడయ్యాక తొలిసారిగా బుధవారం భువనగిరికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ మాట్లాడుతూ కుల గణన ఆధారంగా స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేస్తోందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య బీసీ కమిషన్ వారధిగా పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, సంఘాల నాయకులు మచ్చ నర్సింహ్మా గౌడ్, పిట్టల బాలరాజ్, కైరంకొండ వెంకటేశ్, చిన్నం కృష్ణ, చల్లగురుగుల రఘుబాబు, బెండ లాల్‌రాజ్, నాకోటి రాము, సాల్వేర్ ఉపేందర్, వడిచర్ల శరత్ యాదవ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడిన జిట్టా



జిటా ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న భువనగిరి క్లబ్ సభ్యులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 11: తెలంగాణ ఉద్యమకారుడిగా, స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరాయంగా పోరాడిన జిట్టా బాలకృష్ణారెడ్డి ప్రజా నాయకుడని పలువురు కొనియాడారు. ఆయన సంస్మరణార్థం బుధవారం ఆయన స్వగ్రామం బొమ్మయిపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. అలాగే భువనగిరి క్లబ్‌లో నిర్వహించిన సంతాపసభలో పలువురు సభ్యులు మాట్లాడుతూ ఆరు సంవత్సరాల క్రితం క్లబ్ ఆహ్లాదం కోసం రూ.5లక్షల వ్యయంతో గ్రీనరీ అభివృద్ధి చేశారని, సభ్యుల ఆరోగ్యం కోసం రూ.లక్ష వ్యయంతో జిమ్ ఏర్పాటు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో గద్దె నర్సింహ, గొర్రెంకల శివశంకర్, కాలేరు వినోద్, నీలం రమేష్, శెట్టి బాలయ్యయాదవ్, ఎడ్ల సత్తిరెడ్డి, పెంట నర్సింహ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 11 : మండలంలోని దండుమల్కాపురంలో బుధవారం వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ మన్మథరావు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ మారేడ్‌పల్లికి చెందిన జే సునీత(28) మొదట సాయికుమార్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. సాయికుమార్‌తో విడిపోయి ఆరు నెలల కిందట అదే ప్రాంతానికి చెందిన రవి(26)ని ప్రేమించి పెళ్లిచేసుకుంది. 20రోజుల కిందట ఉపాధి కోసం దండుమల్కాపురం ప్రాంతానికి దంపతులు వచ్చారు. భార్యాభర్తలు కూలీ పనిచేస్తూ స్థానికంగా నివాసముంటున్నారు. బుధవారం ఉదయం భర్త పనికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో సునీత ఉరివేసుకుంది. భర్త ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తీయలేదు. వెనుక నుంచి తలుపులు తొలగించి చూసే సమయానికి ఆమె మృతి చెందింది. డయల్-100కు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భర్త రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

భువనగిరి టౌన్, సెప్టెంబరు 11: శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతామని మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మన వార్డుకు మన చైర్మన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన స్థానిక 9వ వార్డులో పర్యటించారు. వార్డులో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి ఇటీవలే రూ. 21లక్షలు కేటాయించినట్టు తెలిపారు. కమిషనర్ పి.రమాంజాల్‌రెడ్డి, డీఈ కొండలరావు, ఏఈ మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకం



టీజీజీవోల అసోసియేషన్ కార్యవర్గాన్ని సన్మానించిన సభ్యులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 11: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్ అన్నారు. జిల్లా కేంద్రం శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఎన్నికల అధికారి రామరావు సమక్షంలో జిల్లా స్థాయి గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో ఉద్యోగులు అధికంగా శ్రమిస్తారన్నారు. ఉద్యోగులు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఉద్యోగ సంఘాలు తమ వంతు కృషి చేస్తాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు నష్టపోయిన వారికోసం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ వంతుగా విరాళాలు అందజేయడం అభినందనీయమన్నారు. సంఘం అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు, ఉద్యోగులకు మధ్య సంఘాలు వారధిగా పని చేస్తాయని తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకుంటామన్నారు. ఉద్యోగాల భర్తీకి సంఘాలు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాయన్నారు. సంఘం రాష్ట్ర కోశాధికారి మందడి ఉపేందర్‌రెడ్డి అధ్యతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు జగన్, రాష్ట్ర పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సర్వీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. భువనగిరి శివారులో ఎన్నికల అధికారి రామరావు సమక్షంలో జరిగిన నూతన కమిటీ అధ్యక్షుడిగా సి. జగన్మోహన్‌ప్రసాద్ (కలెక్టరేట్ ఏవో), అసోసియేట్ ప్రెసిడెంట్ దొంతి కవిత (భువనగిరి) ఉపాధ్యక్షులు ఎం.జయపాల్‌రెడ్డి (ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి), పి.యాదయ్య (బీసీ కులాల అభివృద్ధి అధికారి), జి. అంబిక (భువనగిరి), బి.యాకుబ్ (రామన్నపేట), వీవీ.రామరావు (దేవస్థానం, యాదగిరిగుట్ట), బి.మంగ్యానాయక్ (సంస్థాన్‌నారాయణపురం), ప్రధానకార్యదర్శి సీహెచ్. శ్రీనివాస్ (ఎంపీడీవో, భువనగిరి), జాయింట్ సెక్రెటరీలు ఎస్.సి ద్దులు (భువనగిరి), పి.ప్రవీణ్‌కుమార్ (కలెక్టరేట్), ఎన్.బాలమణి (భువనగిరి), కోశాధికారి బి.హరిక్రిష్ణ (ఐటీఐ, ఆలేరు)తో పాటు 11మంది కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీ ఎన్నికైంది.

ఆత్మహత్యలతో సాధించేది శూన్యం

● ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ యశోద



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ యశోద

భువనగిరి టౌన్, సెప్టెంబర్ 11: ఆత్మహత్యలతో సాధించేది శూన్యమని, జీవిస్తూ లక్ష్యాన్ని చేరుకోవడం ఉత్తమమని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.యశోద అన్నారు. ఆత్మహత్యల నివారణ వారోత్సవాలలో భాగంగా బుధవారం భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జీవితాలకు పరీక్షా ఫలితాలు ప్రామాణికంకావని, నచ్చిన రంగంలో నైపుణ్యం సాధిస్తే ప్రశాంతంగా జీవించవచ్చని విద్యార్థులకు సూచించారు. పలు కారణాలతో మానసిక ఆందోళనకు గురయ్యే విద్యార్థులు టోల్ ఫ్రీ నెంబర్ 14416కు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. జీవితం చాలా విలువైనదని, ప్రతీ విద్యార్థికి చదువుకునే సామర్థ్యాలు ఉంటాయని, కావాల్సింది శ్రద్ధ మాత్రమేనని అన్నారు. సమావేశంలో డాక్టర్ సుమన్‌కళ్యాణ్, డాక్టర్ ప్రీతిస్వరూప్, ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, సిబ్బంది సాయిరెడ్డి, వసంత, ఇస్తారి, శివ పాల్గొన్నారు.

అడ్డగూడూరు: మండలంలోని సాంఘిక గురుకుల బాలికల పాఠశాల, కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థులకు మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఆత్మహత్యల నివారణపై, మానసిక ఆరోగ్యం, జీవిత విలువ, ఉత్కంఠ నిర్వహణ, సహాయం కోరడంపై, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే అంశాలపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమా, సరిత, పిహెచ్ఎన్ శారద, ఎంపీహెచ్ఎస్ ఎస్.శారద ఉన్నారు.



చంద్రవర్ణ అలంకరణలో విఘ్నేశ్వరుడు

వలిగొండ, సెప్టెంబరు 11: మండల కేంద్రంలో హరిహర త్రిశక్తి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం చంద్రవర్ణ అలంకరణలో స్వామి భక్తులకు దర్శమిచ్చారు. మండలంలో పలు గణపతి మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం జరిపారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 11: యాదగిరిగుట్ట పట్టణంలో వినాయక నిమజ్జనం కోసం చేయనున్న ఏర్పాట్లు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేయాలని యాదగిరిగుట్ట మునిసిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్ అధికారులు, సిబ్బందికి సూచించారు. పట్టణంలో కమిషనర్ అజయ్‌కుమార్ రెడ్డి, పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం.రమేష్‌తో కలిసి బుధవారం చాకలి గిద్ద చెరువు వద్ద గణపతి విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలించిన ఆమె మాట్లాడుతూ ఈ నెల 15, 16, 17తేదీల్లో నిర్వహించే నిమజ్జనంలో ఎలాంటి అపశృతులు జరగకుండా ముం దస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముగ్గురు ఏఏస్లైలు, మున్సిపల్ అధికారి కిరణ్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలి

ఆలేరు రూరల్, సెప్టెంబరు 11: ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ పిలుపునిచ్చారు. బుధవారం ఆలేరులో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 30వ తేదీన చలో ఇందిరాపార్కు ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాల లైబ్రరీకి పుస్తకాల అందజేత

ఆత్మకూరు(ఎం), సెప్టెంబరు 11: మండలంలోని పల్లెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల లైబ్రరీకి అదే గ్రామానికి చెందిన గుర్రం కమలమ్మ వెంకటయ్య జ్ఞాపకార్థం వారి మనవడు గుర్రం సంపత్ 60 రకాల కథల పుస్తకాలను బుధవారం అందజేశారు. అల్మరా కొనుగోలు చేసేందుకు రూ.5000 అందజేశారు.

ఆన్‌లైన్‌లో తుదిజాబితా

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 11: ప్రభుత్వ వైద్య కళాశా లకు సంబంధించి వివిధ విభాగాల్లో ఇటీవల ఎంపికైన తుది జాబితా ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు మెంబరు సెక్రెటరి శాంతిశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ధ్రువపత్రాల పరిశీలనకు ఈ నెల 13వ తేదీన కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

సంక్షిప్తంగా..

చౌటుప్పల్ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దివీస్ అందజేస్తున్న చేయూత అభినందనీయమని పలువురు అన్నారు. దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం దండుమల్కాపురం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల, వెబ్బర్ చైల్డ్‌హోం పాఠశాలలకు రూ.9,11,000 విలువైన నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్స్, వాటర్ బాటిల్స్, షాండిల్స్ విద్యార్థులకు అందజేశారు. మహేశ్వరి, నర్సింహ, బాషా, దివీస్, జి.వెంకటేశ్వర్లు, సాయికృష్ణ ఉన్నారు.

భువనగిరి రూరల్: లో ఓల్టేజీ సమస్యను అధిగమించేందుకు భువనగిరి మండలం వడపర్తిలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు బుధవారం రెవెన్యూ, సర్వేయర్ అధికారులు స్థల పరిశీలన జరిపినట్లు మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి తెలిపారు. గ్రామంలోని 129 సర్వే నెంబర్‌లో ఎకరం 17గుంటల స్థలం అనువుగా ఉన్నట్లు తహసీల్దార్ ఎస్.అంజిరెడ్డి ఆదేశాల మేరకు భూ సేకరణకు స్థల పరిశీలన చేపట్టినట్లు తెలిపారు.

చౌటుప్పల్ రూరల్ : మండలం ఖైతాపురం శివారులోని శివ పాలిమర్స్ ప్లాస్టిక్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని రైతు తగరం నాగరాజు గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. పరిశ్రమ నుండి వ్యర్థ రసాయన జలాలు బయటకు వదలడంతో భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని తెలిపారు.

చౌటుప్పల్ టౌన్ : బ్యాంకుల్లో బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి, పంట రుణాలను తీసుకున్న రైతులకు రూ.2లక్షల వరకు మాఫీ చేయాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం మునుగోడు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి ముటుకుల్లోజు రాఘవ ట్విటర్ వేదిక ద్వారా కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, సీఎంవో కార్యాలయాలకు ట్విటర్ ద్వారా రాఘవ మెసేజ్ చేశారు.

చౌటుప్పల్ టౌన్ : సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడ నుందని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. చౌటుప్పల్ పట్టణంలోని 9 వ వార్డులో రూ. 25.00 లక్షలతో 600 మీటర్ల పొడవున చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను చైర్మన్ రాజు ప్రారంభించారు.

మోత్కూరు: పట్టణ పరిధిలోని శ్రీవెంకటేశ్వర కాలనీ అభివృద్ధి కమిటీని కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గనగాని నర్సింహ, అధ్యక్షుడిగా చొల్లేటి నరేష్, ఉపాధ్యక్షుడిగా మడిపల్లి రంగయ్య, ప్రధాన కార్యదర్శిగా దర్శనం వెంకన్న, కోశాధికారిగా కదారి నర్సయ్య, సహాయ కార్యదర్శిగా దేవరపల్లి విద్యాసాగర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా అంజయ్య, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

మోత్కూరు : పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో మొక్కలు నాటి పెంచాలని మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. వనమహోత్సవంలో భాగంగా బుధవారం మోత్కూరు మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో ఆమె మొక్కలు పంపిణీ చేశారు. వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్ : మండలంలో వివిధ ప్రాంతాల్లో అపహరించిన 24 సెల్ ఫోన్‌లను రికవరీ చేసి, తిరిగి వినియోగదారులకు పోలీసులు అందజేశారు. పోలీసు స్టేషన్‌లో సీఐ మన్మథకుమార్ వినియోగదారులకు సెల్‌ఫోన్లను అందించారు.

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్‌నారాయణపురం గ్రామానికి చెందిన పులమోని గాలయ్య ఇటీవల మృతిచెందాడు. అతనిది నిరుపేద కుటుంబం కావడంతో దశదినకర్మ కార్యక్రమానికి అవసరమైన బియ్యం, ఇతర సరుకులను మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ సహకారంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు బుధవారం అందజేశారు.

రాజాపేట: రైతులు వేసిన పంటలకు వచ్చే చీడపీడల పట్ల జాగ్రత్త వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ కోరారు. రాజాపేట మండలంలోని చల్లూరు, రాజాపేట గ్రామాలల్లో వరిపంటలను పరిశీలించారు.

గుండాల : మండలంలోని బురుజుబావి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోత్కూరు ప్రాజెక్టు అధికారి జ్యోత్స్న మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ యాక్‌పాషా బేగం, టీచర్ బాగ్యలక్ష్మి గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: వరద బాధితుల సహాయార్థంగా తన వంతుగా రూ.10వేల నగదు ఆర్థిక సాయాన్ని అందచేసినట్లు బీఆర్ఎస్ జిల్లా నేత డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల ఖమ్మం ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలు వరదలతో నష్టపోయిన బాధితులకు తన వంతుగా చేయూత అందించినట్లు తెలిపారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఉప్పల లింగస్వామి తండ్రి ఉప్పల పెద్దులు ఇటీవల మృతి చెందాడు. ఎంపీ ఈటల రాజేందర్ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

రామన్నపేట: విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే పెన్షన్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి యాదగిరి, జిల్లా కార్యదర్శి అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. రామన్నపేటలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు.

భువనగిరి రూరల్ : రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బి.అనిల్‌కుమార్ అన్నారు.

సాయుధ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

ఆలేరు రూరల్, సెప్టెంబరు 11: తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన వీరుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ప్రచురించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆలేరులో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్కూరి రాంచంద్రారెడ్డి సుశీలాదేవి త్యాగఫలం నేటికీ మరువలేనిదన్నారు. ఆలేరును ఎరుపెక్కించిన ఆరుట్ల కమలాదేవి, రామచంద్రారెడ్డిలాంటి వీరులను చరిత్రను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు చెక్క వెంకటేష్, కృష్ణ, బలి సత్తయ్య, దండు ప్రభాకర్, కట్కూరి రాంగోపాల్‌రెడ్డి, పరుశరాములు, కవిత, రేణుక, తదితరులు ఉన్నారు.



మోత్కూరులో సమరయోధుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలి

మోత్కూరు : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య డిమాండ్ చేశారు. బుధవారం మోత్కూరు కేఆర్ భవన్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు రావి నారాయణరెడ్డి, మగ్దూం మొహినొద్దీన్, బద్దం ఎల్లారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు అన్నెపు వెంకట్, పుల్కరం మల్లేష్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మొగుల్ల శేఖర్ రెడ్డి, నాయకులు పోచం కన్నయ్య, పెండెం వెంకటేశ్వర్లు, గొలుసుల యాదగిరి, ఎం.తిరుపతిరెడ్డి, చాతరాశి సత్తయ్య, టి.లక్ష్మీనర్సయ్య, ఎం.అంజయ్య, ఎం.కృష్ణ, బుచ్చయ్య, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు పోరాటం

భువనగిరి అర్బన్ : వీర తెలంగాణ విప్లవరైతాంగ సాయుధ పోరాట అమరుల ఆశయ సాధనకు పోరాటం నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కళ్లెం క్రిష్ణ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండలంలో సైదాపురం, ధర్మారెడ్డిగూడెంలో అమనవీరుల స్తూపాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, కలెపల్లి మహేందర్, పేరబోయిన మహేందర్, బబ్బూరి శ్రీధర్, గోరేటి రాములు, పేరబోయిన పెంటయ్య, బండపల్లి నర్సయ్య, ఆరె పుష్ప, లింగారెడ్డి, దుంబాల వెంకట్‌రెడ్డి, నంద వెంకటేశ్, జిల్లా జానకిరాములు, సిద్దులు, ఉప్పలయ్య, మునుకుంట్ల నర్సమ్మ, మద్దూరి భాగ్యమ్మ, పెంటయ్య పాల్గొన్నారు.



ఆలేరులో కట్కూరి రాంచంద్రారెడ్డి స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

రాంరెడ్డి ఆశయాలను సాదిద్దాం

రాజాపేట: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పాశం రాంరెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని, సీపీఐ జిల్లా కార్యదర్శి కొల్లూరి రాజయ్య అన్నారు. రాజాపేట మండల కుర్రారంలో రాంరెడ్డి స్మారక స్తూపం వద్ద సీపీఐ నాయకులు నివాళులర్పించారు. నాయకులు చీగుర్ల లింగం, మంద బిక్షపతి, మంద మల్లేశం, చెడుదిపు రామస్వామి ఉన్నారు.